సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
18-09-2025
పేజీలు: 02



ఉత్తరాఖండ్‌లో మరోసారి క్లౌడ్‌బరస్ట్..

# 10 మంది గల్లంతు

ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కుంభవృష్టి కురుస్తోన్న విషయం తెలిసిందే. ఈ వర్షాలకు ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. ఇప్పటికే వచ్చిన వర్షాలు, వరదలకు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఇప్పుడు తాజాగా అక్కడ మరోసారి వర్షం బీభత్సం సృష్టించింది. చమోలి జిల్లాలోని నందా నగర్‌లో బుధవారం రాత్రి మేఘవిస్ఫోటనం కారణంగా వరదలు సంభవించాయి. ఈ వరదలకు 10 మంది గల్లంతయ్యారు. గల్లంతైన 10 మందిలో కుంత్రి లగా ఫాలి గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు, సర్పానికి చెందిన వారు ఇద్దరు, దుర్మా ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. ఇక ఈ వరదలకు ఆరు భవనాలు కొట్టుకుపోయాయి. రంగంలోకి దిగిన రెస్క్యూ టీమ్ శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులను రక్షించింది. ఆ ప్రాంతంలో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపడుతోంది. కాగా, రెండు రోజుల క్రితం రాజధాని డెహ్రాడూన్‌లో క్లౌడ్‌బరస్ట్ కారణంగా వరదలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ వరదలకు 15 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గల్లంతయ్యారు.




ఓట్ల తొలగింపు వెనుక అజ్ఞాత శక్తులున్నాయ్..

# రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

సెంట్రలైజ్డ్ వ్యవస్థ ద్వారా పథకం ప్రకారం ఓట్లు డిలీట్ చేస్తున్నారు.. ఆరోపణలు కాదు.. పక్కా ఆధారాలతో నేను మాట్లాడుతున్నా.. అంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓట్ చోరీపై హైడ్రోజన్ బాంబ్ పేరుతో రాహుల్‌గాంధీ గురువారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో వేల ఓట్లు తొలగించారని.. ఫేక్ లాగిన్స్, డిజిటల్ ఫామ్స్‌తో ఓట్లు తొలగిస్తున్నారన్నారు. అంతేకాకుండా సీఈసీ జ్ఞానేష్ కుమార్ టార్గెట్‌గా రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓట్ల తొలగింపు వెనుక అజ్ఞాత శక్తులు ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న వారిని సీఈసీ కాపాడుతోందన్నారు. కాంగ్రెస్ బలంగా ఉన్న చోట మమ్మల్ని టార్గెట్ చేసి ఓట్లు తొలగిస్తున్నారంటూ రాహుల్ గాంధీ ఆరోపించారు. వ్యవస్థను హైజాక్ చేశారని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అధికారులకు తెలియకుండా ఓటర్ల జాబితా నుంచి.. ఓట్లు ఎలా పోతాయని ప్రశ్నించారు. ఓట్లను తొలగించేందుకు డిజిటల్ ఫామ్స్ వాడారు.. ఓట్ల తొలగింపుపై కర్నాటక సీఐడీ 18 సార్లు అడిగినా.. ఈసీ ఎలాంటి సమాధానం చెప్పడంలేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

స్విమ్మింగ్‌పూల్ ను తలపిస్తున్న అపార్ట్మెంట్ సెల్లార్

రంగారెడ్డి జిల్లా శేర్లింగంపల్లి నియోజకవర్గంలో గత రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల భారీ వర్షం కారణంగా, శేరిలింగంపల్లిలోని హుడా ట్రేడ్ సెంటర్ లోని ఒక అపార్ట్మెంట్ సెల్లార్ పూర్తిగా వరద నీటితో నిండిపోయింది. గురువారం ఉదయం అపార్ట్మెంట్ వాసులు సెల్లార్ ను పరిశీలించగా, అది స్విమ్మింగ్ పూల్ ను తలపిస్తున్నట్లు తెలిపారు. ఈ సంఘటన స్థానికులను ఆందోళనకు గురిచేసింది.భారీ వర్షానికి రైల్వే అండర్ పాసింగ్ స్విమ్మింగ్ పూల్ ని తలపిస్తున్నట్లు స్థానిక ప్రజలు తెలిపారు. వర్షం కురిసినప్పుడల్లా ఇలాంటి సమస్యలు పునారావృతం అవుతున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.



హైదరాబాద్‌లో

# ఈడీ దాడులు

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం నుంచి సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లో ప్రముఖ వ్యాపారవేత్త బూరుగు రమేశ్ ఇంట్లో తనిఖీలు చేస్తున్నారు. రమేశ్‌తోపాటు ఆయన కుమారుడు విక్రాంత్ నివాసంలోనూ సోదాలు జరుపుతున్నారు. రెండు బృందాలుగా విడిపోయిన ఈడీ అధికారులు అల్వాల్, మారేడుపల్లిలో ఏకకాలంలో తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.







# ఫైనల్లో నీరజ్

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ ప్లేయర్ నీరజ్ చోప్రా అదరగొట్టాడు. బుధవారం జరిగిన పురుషుల జావెలిన్‌త్రో ఈవెంట్‌లో బరిలోకి దిగిన డిఫెండింగ్ చాంపియన్ నీరజ్ తన తొలి ప్రయత్నంలోనే అర్హత మార్క్(84.50మీ)ను అధిగమించాడు. గ్రూపు-ఏ నుంచి పోటీపడ్డ నీరజ్..బరిసెను 84.85మీటర్ల దూరం విసిరి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న నీరజ్ టోక్యోలో తన టైటిల్‌ను నిలబెట్టుకోవడంపై దృష్టి పెట్టాడు. గ్రూపు-ఏలో జర్మన్ జావెలిన్‌త్రోయర్ జులియన్ వెబర్‌తో సహా కేశర్న్ వాల్కట్, జాకబ్ వాద్లిచ్‌తో కలిసి పోటీకి దిగిన చోప్రా స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిచాడు. ఈ రోజు జరిగే ఫైనల్లో పసిడి పతకం సాధించడం ద్వారా రెండు సార్లు టైటిల్ సాధించిన దిగ్గజ అథ్లెట్లు జాన్ జెలెంజీ(93,95), పీటర్స్(19, 22) సరసన నిలిచేందుకు చోప్రా పట్టుదలతో ఉన్నాడు. పారిస్(2024) ఒలింపిక్స్ తర్వాత పాకిస్థాన్ త్రోయర్ అర్షద్ నదీమ్‌తో కలిసి నీరజ్ పోటీపడబోతున్నాడు.



# మిల్కీ బ్యూటీ హాట్ లుక్స్

తమన్నా భాటియా గురించి పెద్దగా పరిచయం అవసరం లేదు. శ్రీ, హ్యాపీడేస్‌లాంటి చిన్న సినిమాల్లో నటించి అందరినీ ఆకట్టుకున్నది. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే బడా హీరోలందరితో నటించి అగ్రహీరోయిన్‌గా ఎదిగింది. దశాబ్దంపైగా దక్షిణాది ప్రేక్షకులను తన అందచందాలు, అభినయంతో మెప్పించింది ఈ మిల్కీ బ్యూటీ. కొంతకాలంగా దక్షిణాదిలో అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్‌పై దృష్టి పెట్టింది. ప్రస్తుతం పలు చిత్రాల్లో ప్రత్యేక గీతాల్లో కనిపించింది. తాజాగా తన కెరీర్‌లోనే తొలిసారిగా సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. ప్రముఖ హారర్ బోల్డ్ ఫ్రాంచైజీ 'రాగిణి MMS' సిరీస్‌లో హీరోయిన్‌గా ఎంపికైందని సమాచారం. ఫిలీం ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్న వార్త ప్రకారం.. ఈ హారర్-థ్రిల్లర్ ప్రాజెక్ట్ కోసం 'ఏక్తా కపూర్' స్వయంగా తమన్నాను సంప్రదించారట. కథ, పాత్ర, అన్నీ విన్న తర్వాత తమన్నా ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తున్నది.




# బుర్జ్ ఖలీఫాపై మెరిసిన ప్రధాని మోదీ

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనం దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా. ప్రత్యేక సందర్భాల్లో ఈ కట్టడం ఎల్‌ఈడీ స్క్రీన్‌తో ప్రత్యేక థీమ్‌ను ప్రదర్శిస్తుంది. తాజాగా ఆ ఎత్తైన భవనంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మెరిశారు. ప్రధాని మోదీ 75వ పుట్టిన రోజును బుధవారం ఘనంగా జరుపుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులతోపాటూ పలు దేశాధినేతలు ప్రధానికి ప్రత్యేకంగా బర్త్‌డే విషెస్ తెలియజేశారు. ప్రధాని మోదీ, భారత్‌తో తమకున్న అనుబంధాన్ని వీడియో ద్వారా పంచుకున్నారు. ఈ నేపథ్యంలో మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షలతో బుర్జ్ ఖలీఫా వెలుగులీనింది. ప్రధాని చిత్రంతోపాటూ, జాతీయ జెండాను కూడా ప్రదర్శించింది. ఇందుకు సంబంధించిన వీడియోను బుర్జ్ ఖలీఫా అధికారిక ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ ఖాతాల్లో షేర్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది.




# అమెరికాలో కాల్పులు.. ముగ్గురు పోలీసులు మృతి

అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. పెన్సిల్వేనియాలోని ఉత్తర కోడోరస్ టౌన్‌షిప్‌లో పోలీసులే లక్ష్యంగా దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. దీంతో ముగ్గురు పోలీసు అధికారులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. అయితే పోలీసుల కాల్పుల్లో దుండగుడు కూడా హతమయ్యాడని అధికారులు వెల్లడించారు. కాల్పులకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని పెన్సిల్వేనియా స్టేట్ పోలీస్ కమిషనర్ క్రిస్టోఫర్ పారిస్ తెలిపారు. కాల్పుల ఘటనపై పెన్సిల్వేని యా గవర్నర్ జోష్ షపిరో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తమ దేశం, కౌంటీ కోసం పనిచేసిన అత్యంత విలువైన అధికారులను కోల్పోయామన్నారు. ఇలాంటి హింసాత్మక చర్యలు సహేతుకం కాదని చెప్పారు. ఇంకా మెరుగైన సమాజం కోసం అంతా కలిసి పనిచేద్దామని తెలిపారు.



# పార్కులను కాపాడిన హైడ్రా

పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను హైడ్రా బుధవారం కాపాడింది. దాదాపు 1600 గజాల వరకూ ఉన్న ఈ భూమి విలువ రూ. 16 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం, మూసాపేట సర్కిల్ పరిధిలోని సనత్‌నగర్ కోపరేటివ్ సొసైటీకి చెందిన లే ఔట్లో వెయ్యి గజాల పార్కు స్థలాన్ని కాపాడింది. 1967లో 172 ప్లాట్లతో ఈ లే ఔట్‌ను వేశారు. ఇందులో 1200 గజాల స్థలాన్ని పార్కులకోసం కేటాయించారు. ఈ పార్కు ఆక్రమణలకు గురౌతున్నట్టు మోతినగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వాళ్లు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు జీహెచ్ ఎంసీ, డీటీసీపీ, రెవెన్యూ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా.. పార్కు స్థలంగా గుర్తించి వెంటనే ఆక్రమణలను తొలగించింది. చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని మదీనగూడ విలేజ్‌లో పార్కుతో పాటు ప్రజావసరాలకు ఉద్దుశించిన 600ల గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. శ్రీ అభయాంజనేయ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు మేరకు రెవెన్యూ, జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించింది. పార్కుతో పాటు ప్రజావసరాలకు దాదాపు 600ల గజాల స్థలాన్ని కేటాయించగా.. అందులో గోశాల పేరుతో కొంత భాగం, పిండి గిర్నీ కోసం మరి కాస్త కబ్జా చేశారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## రేవంత్ ఓ నియంత: కెటిఆర్

తెలంగాణలో ప్రస్తుతం ముఖ్యమంత్రి నియంతలా వ్యవహరిస్తున్నారని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో గ్రూప్-1 అభ్యర్థులు, విద్యార్థులు కనీసం రౌండ్‌టేబుల్ సమావేశం కూడా పెట్టుకోలేని పరిస్థితి ఉందని అన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్ చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ అన్ని వర్గాల పైన ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, స్కూళ్లు, కాలేజీలు మూతపడ్డాయని, ఆరోగ్యశ్రీ సేవలు రద్దు చేయడంతో హాస్పిటళ్లు స్తంభించాయని విమర్శించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత చేసిన ఒక్క పని అయినా చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఆశా వర్కర్లు, రేషన్ డీలర్ల ఆందోళనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సచివాలయానికి రావడం లేదని, గతంలో ప్రగతి భవన్ గురించి అనేక అబద్ధాలు చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. 'హైడ్రా' కాస్త 'హైడ్రామా' అయిందని, 'హైడ్రా'కు పెద్ద వాళ్ళు కనిపించరని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తమ చేతి గుర్తును తీసివేసి బుల్డోజర్ గుర్తును పెట్టుకోవాలని సూచించారు.



## వనపర్తిలో బోల్తాపడిన ఆటో పైనుంచి వెళ్లిన లారీ: ఇద్దరు మృతి

వనపర్తి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పెద్దల పండగ సందర్భంగా పొట్టేళ్లను తీసుకొని వెళ్తుండగా నాసనాల్లి సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటో పైనుండి లారీ దూసుకెళ్లడం ఇద్దరు మృతి చెందారు. ఒకరు గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. పెద్దల పండుగ సందర్భంగా రవి(35), సరోజ(30) అనే దంపతులు ఆటోలో పొట్టేళ్లను తీసుకొని వస్తుండగా వాహనం బోల్తాపడింది. ఎదురుగా వస్తున్న లారీ, ఆటోను ఎక్కించడంతో రవి, డ్రైవర్ రాజు (38) అక్కడికక్కడే చనిపోయారు. సరోజ తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## ముగిసిన 'ఐటీఆర్' గడువు.. మరి 'రీఫండ్' ఎన్ని రోజుల్లో వస్తుంది

ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులు ఫైల్ చేసేందుకు ఇచ్చిన గడువు సెప్టెంబర్ 16, 2025తో ముగిసింది. ఐటీ విభాగం గణాంకాల ప్రకారం 7.3 కోట్ల మంది తమ రిటర్నులను దాఖలు చేశారు. గతేడాదితో పోలిస్తే ఈసారి కాస్త ఎక్కువే రిటర్నులు ఫైల్ అయ్యాయి. ఇప్పుడు ఆ ట్యాక్స్ పేయర్లు అందరు తమకు రావాల్సిన రీఫండ్ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఇన్‌కమ్ ట్యాక్స్ రీఫండ్ స్టేటస్ చెక్ చేసుకునే ముందే మీ ఐటీఆర్ ఫారం ఆమోదం పొందిందా లేదా ప్రాసెస్ అయిందా అనేది చూసుకోవాల్సిన అవసరం ఉంది. కొన్ని సందర్భాల్లో ఇచ్చిన డేటాలో తేడాలు వచ్చి ఐటీఆర్ ప్రాసెస్ చేయకపోవచ్చు. ట్యాక్స్ పేయర్లకు ఐటీ విభాగం నోటీసులు జారీ చేస్తుంది. వాటికి అనుగుణంగా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

## 'మార్కో' సీక్వెల్ కి క్రేజీ టైటిల్!


ఈ మధ్య కాలంలో ఇండియన్ సినిమా దగ్గర క్రేజీ వైలెంట్ సినిమాగా సెన్సేషన్ సెట్ చేసిన చిత్రమే "మార్కో". మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ హీరోగా దర్శకుడు హనీఫ్ అదేని తెరకెక్కించిన ఈ సినిమాకి తెలుగు, హిందీ లలో కూడా మంచి వసూళ్లు వచ్చాయి. అయితే వీటితో పాటుగా ఈ సినిమాలో విజువల్స్ అందులోని వైలెంట్ కంటెంట్ దెబ్బకి పలు కాంట్రవర్సీలు కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇక దీని సీక్వెల్ కూడా ఆగే పరిస్థితికి వచ్చింది. కానీ మార్కో కి ఫైనల్ గా సీక్వెల్ ఇపుడు ఖరారు అయినట్టు తెలుస్తోంది. మరి దీనికి మేకర్స్ "లార్డ్ మార్కో" అనే టైటిల్ ని ఫిక్స్ చేశారట. అలాగే ఈ సినిమాలో ఉన్ని కనిపించకపోవచ్చు అనే కూడా వినిపిస్తోంది. మరి దీనిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఇదిలా ఉంటే ఉన్ని ముకుందన్ పై నిన్ననే ప్రధాని నరేంద్ర మోడీపై భారీ బయోపిక్ అనౌన్స్ అయ్యిన సంగతి తెలిసిందే.

## వరుణ్ @1




భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకుకు చేరుకున్నాడు. బుధవారం ఐసీసీ విడుదల చేసిన టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అతడు అగ్రస్థానానికి చేరుకున్నాడు. తద్వారా భారత్ నుంచి జస్‌ప్రీత్ బుమ్రా, రవి బిష్ణోయ్ తర్వాత ఈ ఘనత సాధించిన మూడో భారత బౌలర్‌గా నిలిచాడు. ఏడాది కాలంగా ఈ ఫార్మాట్‌లో అంచనాలకు మించి రాణిస్తున్న ఈ తమిళనాడు స్పిన్నర్.. తాజా ర్యాంకుల్లో మూడు స్థానాలు ఎగబాకి 733 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నాడు. ఇక ఈ ఫార్మాట్ ర్యాంకింగ్స్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శిస్తున్నది. బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ (884 రేటింగ్ పాయింట్లు) మొదటి స్థానాన్ని నిలబెట్టుకోగా ఆల్‌రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా (237) నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. టీమ్ ర్యాంకింగ్స్‌లోనూ టీమ్ఇండియా.. 271 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. ఆసీస్, ఇంగ్లండ్, కివీస్ తదుపరి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

## అమెరికాలో కాల్పులు ముగ్గురు పోలీసులు మృతి



అమెరికా రాష్ట్రం పెన్సిల్వేనియాలో కాల్పులు కలకలం సృష్టించాయి. నార్త్ కొడరస్ టౌన్‌షిప్‌లో ఓ దుండుగుడు కాల్పులు జరపడంతో ముగ్గురు పోలీస్ అధికారులు మృతి చెందారు. పోలీసుల కాల్పుల్లో దుండగుడు హతమయ్యాడు. మరో ఇద్దరు గాయపడడంతో యార్క్ ఆస్పత్రికి తరలించారు. నార్త్ కొడరస్ టౌనిషిప్ లో 2500 మంది ప్రజలు ఉంటారని, స్కూల్ సమీపంలో కాల్పులు జరిగాయని పోలీసులు వెల్లడించారు. పిలిదెల్ఫియా నుంచి 160 కిలో మీటర్ల దూరంలో యార్క్ కౌంటీలో ఈ ఘటన జరిగింది. ముగ్గురు పోలీసులు మృతి చెందడం పట్ల గవర్నర్ జోష్ షాపిరో దిగ్భ్రాంత్రా వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలపడంతో వారి కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ఇలాంటి హింస సరి కాదు, మన సమాజంగా మరింత మెరుగ్గా చేయాలని పిలుపునిచ్చారు. షాపిరో రాష్ట్రంలోని జాతీయ జెండాలను సగానికి దించి అమరులను స్మరించుకోవాలన్నారు.

## ప్రపంచాన్ని శాసిస్తున్నాం: రాజ్‌నాథ్



'భారత్ ఏ శక్తి ముందు తలవంచదు...భవిష్యత్తులోనూ దించదు...ఆపరేషన్ సిందూర్ అరంభం మాత్రమే... అంతం కాదు..' అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా బుధవారం పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ ఆపరేషన్ సిందూర్ ముగియలేదన్నారు. పహల్గాంలో తీవ్రవాదులు మన భారతీయులను మతం అడుగుతూ చంపారని ఆయన తెలిపారు. దానికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో మన సైనికులు తీవ్రవాది మసూద్ అజర్‌ను మట్టుబెట్టారని, స్థావరాలను ధ్వంసం చేశారని ఆయన చెప్పారు. మన సైనికులు చాటిన సత్తాను ప్రపంచం అంతా ఆసక్తిగా గమనించిందని ఆయన తెలిపారు. దేశంలో ఎన్ని విభేదాలు ఉన్నా దేశం విషయంలో అందరూ కలిసి ఒకే మాటపై ఉంటామని, దేశ రక్షణ, భద్రత విషయంలో ఏకతాటిపై ఉంటామన్నారు. మన దేశం ఇప్పుడు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగిందని ఆయన తెలిపారు.

**పటేల్ సమర్థత వల్లే..**

నాడు ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సమర్థత వల్లే నిజాం తన ఓటమిని అంగీకరించి లొంగి పోయాడని ఆయన చెప్పారు. దీంతో భారత్‌లో హైదరాబాద్ రాజ్యం విలీనమైందన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధర్మ మార్గంలో నడుస్తామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. జాతీయ సమర్థతను దెబ్బ తీసే కుట్రలను తిప్పికొడతామన్నారు. పటేల్ కన్న కలలకు అనుగుణంగానే ప్రధాని నరేంద్ర మోడి పాలన సాగుతున్నదని ఆయన చెప్పారు. భారత్‌ను ఎవరూ తక్కువ అంచనా వేయవద్దని కళ్ళలో కళ్ళు పెట్టి చూసే సాహసాన్ని శత్రువులు చేయలేరని అన్నారు.

## 'ఓజి'లో ప్రకాష్ రాజ్.. పోస్టర్ తో రోల్ రివీల్!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన అవైటెడ్ సినిమానే "ఓజి". ఇంకా రిలీజ్ కి కేవలం వారం మాత్రమే గడువు ఉంటే ఈ సమయంలో మేకర్స్ ఒకో పాత్రకి సంబంధించిన పోస్టర్ ని రిలీజ్ చేస్తున్నారు. ఇలా నిన్న అర్జున్ దాస్ పోస్టర్ ని రిలీజ్ చేస్తే లేటెస్ట్ గా నటుడు ప్రకాష్ రాజ్ పోస్టర్ ని కూడా రివీల్ చేశారు. మరి ఈ సినిమాలో ప్రకాష్ రాజ్ సత్య దాదాగా కనిపించనున్నట్టుగా తనపై ఓ కొత్త లుక్ తో రివీల్ చేశారు. మరి సినిమాలో తన రోల్ ఇంకెంత కీలకంగా ఉంటుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల.. నాలుగు బిల్లులు వచ్చేస్తున్నాయ్

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చిన పథకాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిలో ముఖ్యంగా ఆరు గ్యారెంటీలు ఉన్నాయి. వీటి దరఖాస్తులను ప్రజాపాలనలో భాగంగా తీసుకున్నారు. ఆ తర్వాత రేవంత్ సర్కార్ ప్రజలకు సంక్షేమాన్ని అందించే దిశగా అనేక కొత్త పథకాలు ప్రవేశపెట్టింది. అందులో రైతు రుణమాఫీ, మహాలక్ష్మి, రాజీవ్ యువ వికాసం వంటి పథకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వాటితో పాటు ఇందిరమ్మ ఇళ్లు పథకం కూడా పెద్ద ఎత్తున అమలవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేదలకు సొంతింటి కల నెరవేర్చే ఉద్దేశంతో ఈ పథకం ముందుకు సాగుతోంది.

**సిద్ధంగా గృహ ప్రవేశాలు..**

గృహనిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతం ఇచ్చిన వివరాల ప్రకార.. ఇప్పటి వరకు రూ.1,435 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. మొత్తం 2.15 లక్షల ఇళ్ల పనులు ప్రారంభమవగా, 1.29 లక్షల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వాటిలో 20 వేల ఇళ్లు గోడల వరకు, 8,633 ఇళ్లు పైకప్పు వరకు పూర్తయ్యాయి. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో నిర్మాణం ముగిసిన ఇళ్లకు గృహప్రవేశాలు జరుగుతున్నాయి.

**13,841 మందికి రూ.146.30 కోట్లు..**

లబ్ధిదారుల ఖాతాల్లో నిధులను నేరుగా జమ చేసే విధానాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోంది. ప్రతి సోమవారం ఆధార్ నెంబర్ ఆధారంగా డబ్బులు జమ అవుతున్నాయి. ఇటీవల 13,841 మందికి రూ.146.30 కోట్లు విడుదల చేశారు. ఈ పథకం మొత్తంగా నాలుగు విడతలుగా నిధుల బదిలీపై ఆధారపడి సాగుతోంది. ఇప్పటికే చాలా మందికి మూడో, నాలుగో విడతల బిల్లులు వచ్చి చేరాయని లబ్ధిదారులు చెబుతున్నారు. మీరు కూడా ఒక్కసారి అకౌంట్ చెక్ చేసుకోండి.. ప్రతీ సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి డబ్బులను ప్రభుత్వం జమ చేస్తోంది. ప్రజలు గృహనిర్మాణం పూర్తి చేసి సొంత గృహంలో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతుండటం ఆనందకరమైన విషయం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తుండటంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదలకు ఉపశమనం లభిస్తోంది.

## వేదిక హాట్ పోజులు

అందాలన్నీ అడవి కాచిన వెన్నెల.. అన్న పదం హీరోయిన్ వేదిక కు కరెక్ట్‌గా సరిపోతుందేమో. సన్నజాజి లాంటి నడుము, పాల రంగు శరీరం, కుర్రాళ్లకు పిచ్చికించే ఫిజిక్ ఉన్నా ఇండస్ట్రీలో ఆమెకు సరైన అవకాశాలు రాలేదనే చెప్పాలి. 40 ఏళ్లకు దగ్గర పడుతున్నా ఇంకా టీనేజ్ యువతిలా కనిపిస్తూ తన అందాలతో మత్తెక్కిస్తూనే ఉంటుంది. చేతిలో సినిమాలు లేకపోయినా సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ పరువాల జాతర చేస్తుంటుంది. సోలాపూర్‌కి చెందిన వేదిక 2006లో తమిళ చిత్రం 'మదరాసి'తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ చిత్రం పెద్దగా ఆకట్టుకోకపోయినా ఆ మరుసటి ఏడాది లారెన్స్‌తో 'ముని' చిత్రంలో నటించి హిట్టు కొట్టింది. అదే ఏడాది నందమూరి కళ్యాణ్‌రామ్ సరసన 'విజయదశమి'లో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది.

